సాక్షి ఒడిశా
శుక్రవారం । 23 । జూన్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలక వర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.2,54,886లు, బంగారం 1.87 గ్రాములు, వెండి 700 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



తొలకరి పలకరింపు..

- 8లో



దశావతారాల్లో.. అవతారమూర్తి

- 8లో

న్యూస్‌రీల్

నకిలీ రైల్వే టీటీఈ అరెస్ట్



కొరాపుట్ రైల్వే పోలీసుల అదుపులో బుదురి నాగ్

కొరాపుట్: రైల్వే టీటీఈ(టికెట్ తనిఖీ అధికారి)గా ప్రయాణికులను మోసగిస్తున్న వ్యక్తిని కొరాపుట్ రైల్వే పోలీసులు అరెస్ట్ చేసారు. విశాఖపట్నం–కొరాపుట్ పాసింజర్ రైలులో టీటీఈ దుస్తులు ధరించిన వ్యక్తి హల్‌చల్ చేశాడు. పలువురు ప్రయాణికుల నుంచి డబ్బులు డిమాండ్ చేశాడు. గమనించిన రైల్వే పోలీసులు అనుమానాస్పదంగా అనిపించడంతో ఉన్నతాధికారులకు సమాచారం అందించి, అదుపులోకి తీసుకున్నారు. అనంతరం తమదైన శైలిలో ప్రశ్నించగా అసలు విషయం బయటపడింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కొయాపాల్‌కు చెందిన బుదురి నాగ్ గతంలో విశాఖపట్నంలోని ఓ కర్రల డిపోలో పని చేసేవాడు. అక్కడి నుంచి పరారైన అతను.. వివిధ సందర్భాల్లో తాను టీటీఈగా చెబుతూ రైల్వే ప్రయాణికులను మోసగించినట్లు వెల్లడైంది.ఈ మేరకు నిందితుడి నుంచి రూ.140లు స్వాధీనం చేసుకోవడం తోపాటు రిమాండ్‌కు తరలించారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి భెజా గ్రామం సమీపంలో ఉన్న మామిడి తోటలో ఓ వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు బుధవారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నారు. మృతుడు కాసీపూర్ సమితి సారిసాబాడి గ్రామానికి చెందిన కేశవ్ నాయక్(42)గా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్యాణ సింగుపూర్ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఎస్‌ఐ ముతాలి పట్నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. భెజా గ్రామస్తులు కొందరు బుధవారం సాయంత్రం మామిడి తోట వైపు వెళ్తుండగా చెట్టుకు వేళాడుతూ ఓ మృతదేహం కనిపించింది. దీనిపై పోలీసులకు అందించిన సమాచారం మేరకు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అతని వద్ద లభించిన ఆధార్‌కార్డు ప్రకారం జిల్లాలోని కాసీపూర్ సమితి సారిసాపాదొరొ గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. అయితే కాసీపూర్ నుంచి భెజా గ్రామానికి ఎందుకు వచ్చి ఆత్మహత్య చేసుకోవాల్సి వచ్చిందనే విషయంపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఘటన హత్యా? లేక ఆత్మహత్య? అనే విషయమై పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా వెల్లడిస్తామని వివరించారు.

గజపతి కలెక్టర్‌గా స్మృతిరంజన్ ప్రధాన్



స్మృతిరంజన్ ప్రధాన్

పర్లాకిమిడి: జిల్లాకు నూతన కలెక్టర్‌గా స్మృతిరంజన్ ప్రధాన్ నియమితులయ్యారు. 2012 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన ఆయన.. ఇప్పటి వరకు కటక్‌లో మత్స్యశాఖ డైరెక్టర్‌గా, ఫిషీ కల్చర్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు వహిస్తున్నారు. దీనికి సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయం గురువారం ఉత్తర్వు్ల జారీ చేసింది. అలాగే ప్రస్తుత కలెక్టర్ లింగరాజ్ పండా సామాజిక సంక్షేమం, మహిళా, శిశు అభివృద్ధి శాఖకు బదిలీ అయ్యారు. గజపతి జిల్లాను బాల్య వివాహాల రహితంగా తీర్చిదిద్దడంలో ఆయన చర్యలను అభినందిస్తూ ఇటీవల న్యూఢిల్లీలో నీతిఆయోగ్ అవార్డును అందజేసింది.

అభివృద్ధి పనులకు శ్రీకారం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ రమేష్

మల్కన్‌గిరి: జిల్లాలోని 7సమితుల్లో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి శిలా ఫలకాన్ని నవరంగపూర్ ఎంపీ రమేష్ మాఝి మల్కన్‌గిరి మున్సిపల్ కార్యాలయం వద్ద గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ నిధుల నుంచి 13ప్రాజెక్టులు చేపట్టేందుకు నిర్ణయించామని తెలిపారు. ప్రజలకు పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించేందుకు అనుగుణంగా రోడ్లు, తాగునీరు అందిచేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మల్కన్‌గిరి మున్సిపల్ చైర్మన్ మనోజ్ బారిక్, ఉపాధ్యాక్షురాలు కవిత మహంతొ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లాంబధర్ తురుక్, సమితి సభ్యులు, బీజేడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నయన మనోహరం..

- జగన్నాథుని రాకతో కళకళలాడుతున్న గుండిచా మందిరం
- అడపా మండపంపై కొలువుదీరిన మూల విరాట్‌లు
- నిత్య పూజాదికాలు, సేవలకు ప్రత్యేక ఏర్పాట్లు
- గురువారం సాయంత్రం వరకు రథం నుంచే దర్శనమిచ్చిన దేవదేవుళ్లు



గుండిచా మందిరం ప్రాంగణంలో రథాల వద్ద భక్తుల రద్దీ (ఇన్‌సెట్లో) నిఘా పరికరాలతో జనం కదలికలను పసిగడుతున్న పోలీసు సిబ్బంది

భువనేశ్వర్: పూరీ శారదా బాలి గుండిచా మందిరం కళకళలాడుతోంది. నవ దినాత్మక యాత్ర నిమిత్తం శ్రీమందిరం రత్నవేదిక నుంచి తరలివచ్చిన చతుర్ధా మూర్తుల మూల విరాట్‌లు గుండిచా మందిరం అడపా మండపానికి తరలి వెళ్లాయి. వారం రోజులు ఈ వేదికపై పూజలందుకుని భక్తులు, యాత్రికులకు దర్శనమిస్తారు. ఈ మండపంపై మూల విరాట్‌ల దర్శనం ఏడాదికి వారం రోజులు మాత్రమే లభిస్తుంది. ఈ దర్శనం కోటి జన్మల పుణ్యఫలం ప్రసాదిస్తుందని భక్తుల విశ్వాసం. గుండిచా దేవాలయంలోకి సుదర్శనుడు, బలభద్రుడు, దేవీ సుభద్ర, జగన్నాథుని మూల విరాట్‌లతో ఉత్సవ మూర్తుల ప్రవేశ ప్రక్రియ గురువారం సాయంత్రం 5.25 గంటలకు ప్రారంభమైంది. శ్రీమందిరం సింహద్వారం ఆవరణ నుంచి మంగళవారం బయల్దేరిన రథాలు అర్ధాంతరంగా ఆగడంతో గురువారం సాయంత్రం వరకు శారదా బాలి ప్రాంగణంలో రథాలపై మూల విరాట్లు కొలువు దీరాల్సి వచ్చింది. ఈ రెండు రోజులు భక్తులు స్వామివారిని రాత్రింబవళ్లు కనులారా దర్శించుకున్నారు. గుండిచా మందిరం అడపా మండపం జన్మ వేదికగా పరిగణిస్తారు. రత్న వేదిక నుంచి రథాల పైకి తరలించే క్రమంలో రథాల పైనుంచి మూల విరాట్‌లను అడపా మండపానికి గొట్టి పాహాండిలో సురక్షితంగా తరలించారు. దీనిని అడపా మండప విజేగా పేర్కొంటారు. అంతకు ముందే సంధ్యా ధూపం సేవను రథాలపై ముగించి రథాలకు అమర్చి ఉన్న కొయ్య గుర్రాలను తొలగించి మూల విరాటులను కిందకు దించేందుకు వీలుగా చారుమళ్లని అమర్చారు. మరోవైపు గుండిచా మందిరంలో అడపా మండపం శుచి, శుభ్రత పనులను పూర్తి చేసి, స్వామి కొలువు దీరేందుకు సిద్ధం చేశారు.

యథాతథంగా ఉత్సవమూర్తులు..

మదన్ మోహన, రామకృష్ణుల ఉత్సవ మూర్తులను ముందుగా గుండిచా ఆలయంలోకి తీసుకువెళ్లి, ప్రత్యేకంగా దక్షిణ గృహంలో ఉంచారు. అనంతరం చక్రరాజ్ సుదర్శన్ వెంబడి ప్రధాన దారుమూర్తులు క్రమంగా అడపా మండపానికి చేరాయి. మూల విరాట్‌లు మండపంపై ఆసీనులు కావడంతో ఉత్సవ మూర్తులను యథాతథంగా ప్రధాన మూర్తుల చెంతకు చేర్చడంతో గొట్టి పాహండి ప్రక్రియ ముగిసింది. ఈ సందర్భంగా హరి బోల్(హరినామ సంకీర్తన), మంత్రోచ్చారణలు, శంఖధ్వని, మేళతాళాలు, బాజాభజంత్రీలు, ఘంటానాదం సవ్వడి మధ్య అత్యంత అట్టహాసంగా కొనసాగింది. ఈ సందడి మధ్య శయ్యా(శోభిత మకుటాలు) అలంకరణతో మూల విరాట్‌లు రథాలపై నుంచి దిగే ఘడియల్లో భక్తజనం తన్మయత్వంలో మునిగి తేలింది.

నేటి నుంచి ఒబొధా లభ్యం..

జగన్నాథుని దర్శనంలో మహాప్రసాద సేవన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ఏటా రథయాత్ర సందర్భంగా మాత్రమే స్వామి అన్న ప్రసాదాలు(ఒబొధా) గుండిచా మందిరం ప్రాంగణంలో లభిస్తుంది. దీనిని అడపా ఒబొధాగా పేర్కొంటారు. శుక్రవారం నుంచి గుండిచా ఆలయంలో భక్తులకు ఈ ప్రసాదం అందుబాటులో ఉంటుందని శ్రీమందిరం పాలకమండలి ప్రతినిధులు వెల్లడించారు. గుండిచా మందిరంలో మూల విరాట్‌ల దర్శనం కోసం మారుమూల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో యాత్రికులు తరలి వస్తారు. ఈ మేరకు రద్దీ నియంత్రణ చురుగ్గా ఏర్పాట్లు చేపడుతున్నారు.

గుండిచాలో నిత్య సేవలు..

గురువారం రాత్రి నుంచి గుండిచా మందిరంలో జగన్నాథుని సేవాదులు పూర్తిస్థాయిలో ఊపందుకున్నాయి. ప్రధానంగా బొడొ సింగారొ, పవళింపు సేవలు గురువారం రాత్రి సేవల్లో ప్రాధాన్యత సంతరించుకున్నాయి. పవళింపు సేవాదులకు అవసరమైన మంచం, పరుపులు, దిండ్లు వగైరా సరంజామా ప్రధాన ఆలయం శ్రీమందిరం నుంచి గుండిచా మందిరానికి సాయంత్రమే తరలించారు. స్వామి దైనందిన సేవాదులు, నిత్య వినియోగ సామగ్రి అంచెలంచెలుగా శుక్రవారం నాటికి తరలి వస్తుంది.



దక్షిణ గృహానికి రామకృష్ణుల ఉత్సవమూర్తుల తరలింపు



అడపా విజేకి తరలివచ్చిన రయ్యా



గుండిచా మందిరానికి పవళింపు సేవ సరంజామా తరలిస్తున్న దృశ్యం



భక్తజనం మధ్య అడపా మండప విజే ఉత్సవం



శారదా బాలి ఆవరణలో రథంపై జగన్నాథుని దర్శించుకుంటున్న భక్తురాలు

సేవలకు సత్కారం

- రాష్ట్రానికి చెందిన ఇరువురికి ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు



రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో ఫ్లోరెన్స్ నైటింగెల్ అవార్డు గ్రహీతలు

భువనేశ్వర్: దేశ రాజధాని ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్రానికి చెందిన ఇద్దరు మహిళలు సేబతి సాహు, మంజులతా మహరణ వరుసగా 2022, 2023 సంవత్సరాల జాతీయస్థాయి ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డులను అందుకున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఇరువురూ ఈ ప్రతిష్టాత్మక పురస్కారం అందుకోవడం విశేషం. నర్సులు, నర్సింగ్ నిపుణులు సమాజానికి అందించిన విశేష సేవలకు గుర్తింపుగా 1973లో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ఈ అవార్డులను ప్రవేశ పెట్టింది. యసేబతి సాహు ప్రస్తుతం నవరంగ్‌పూర్ జిల్లా ప్రధాన ఆస్పత్రిలో నర్సింగ్ ఆఫీసర్‌గా పని చేస్తున్నారు. ఈ రంగంలో ఆమెకు 18 ఏళ్లుగా సేవలందిస్తున్నారు. కోవిడ్ మహమ్మారి సమయంలో ఆమె కీలక పాత్ర పోషించారు. అలాగే మంజులత మహరాణా పూరీ సహస్‌పూర్ ఆరోగ్య ఉప కేంద్రంలో ఏఎన్‌ఎంగా పని చేస్తున్నారు. ఈ రంగంలో 19ఏళ్ల విశేష అనుభవం కూడగట్టుకున్నారు. ప్రసవ వేదనల్లో ప్రాణాపాయ స్థితి నుంచి వృత్తిపరమైన నైపుణ్యతతో పలువురు గర్భిణుల ప్రాణాలు కాపాడింది. వరదల విపత్కర పరిస్థితుల్లో అంబులెన్స్ వాహనాల్లో అత్యవసర చికిత్స సేవలతో అనేక మంది మహిళలకు సుఖప్రసవ సౌకర్య కల్పించి, ప్రాణాలు కాపాడింది.



మంజులత మహరాణ



కొరాపుట్: సేబతి సాహుకు ప్రశంసాపత్రం అందిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

గంజాయితో నాటు తుపాకీ స్వాధీనం



రాయగడ: గంజాయితో పట్టుబడిన నిందితులు

రాయగడ: జిల్లాలోని పద్మపూర్ పోలీసులు బుధవారం సాయంత్రం నిర్వహించిన వాహన తనిఖీల్లో కారులో అక్రమంగా తరలిస్తున్న 50కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పద్మపూర్ ఐఐసీ ముకుందదేవ్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం ఇందుపూర్ కూడలిలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా కారులో 50కిలోల గంజాయి పట్టుబడిందని తెలిపారు. దీనికి సంబంధించి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి నాటు తుపాకీ తోపాటు 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. నిందితులను గురువారం ఉదయం కోర్టుకు తరలించినట్లు వివరించారు.

7కిలోల గంజాయి సీజ్..

జయపురం: సంచితో గంజాయి తరలిస్తున్న వ్యక్తిని జయపురం తమ శాఖ సిబ్బంది అరెస్ట్ చేశారని ఎక్సైజ్ అధికారి సంజయ్‌కుమార్ కండి గురువారం తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు 26వ జాతీయ రహదారి జయపురం–లక్ష్మీపండా కూడలి వద్ద బుధవారం రాత్రి గస్తీ చేపట్టారు. అటుగా వస్తున్న వ్యక్తిని తనిఖీ చేయగా, ఆయన వద్ద ఉన్న బ్యాగ్‌లో గంజాయి బయటపడింది. నిందితుడు గంజాం జిల్లాకు చెందిన కునా స్వాయిగా గుర్తించారు. పట్టుబడిన గంజాయి 7కిలోలు ఉంటుందని, దీని విలువ రూ.70 వేలు ఉంటుందని వివరించారు. నిందితుడిని అరెస్ట్ చేసి, కేసు నమోదు చేశారు.



జయపురం: పట్టుబడిన నిందితుడు, గంజాయితో పోలీసులు

అంబాగుడను పోలీసు స్టేషన్‌గా మార్చాలి



సబ్ కలెక్టరేట్ వద్ద సామాజిక కార్యకర్త హరిరావు, గ్రామస్తులు

- 10 గ్రామ పంచాయతీల ప్రజలు డిమాండ్

జయపురం: సబ్ డివిజన్ పరిధి సదర్ పోలీసు స్టేషన్‌లో అంతర్భాగమైన అంబాగుడ పోలీసు బీట్ హౌస్‌ను పూర్తిస్థాయి పోలీస్ స్టేషన్‌గా మార్చాలని జయపురం సమితిలోని 10పంచాయతీలకు చెందిన ప్రజలు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో సామాజిక కార్యకర్త బి.హరిరావు నేతృత్వంలో అంబాగుడ, కుములిపుట్, హడియ, రొండాపల్లి, జాముండ, కెవిడి, కొంగ, పూజారిపుట్, రాణికేవిడి తదితర గ్రామ పంచాయతీల ప్రతినిధులు గురువారం జయపురం సబ్ కలెక్టర్ దేవధర ప్రధాన్‌ను కలిసి, వినతిపత్రం అందించారు. తమ పంచాయతీల్లో దాదాపు 40వేలకు పైగా ప్రజలు నివసిస్తున్నారని తెలిపారు. అంబాగుడ మేజర్ పంచాయతీలో ఇటీవల దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు పెరుగుతున్నాయన్నారు. ఈ ప్రాంతం మీదుగా 26వ జాతీయ రహదారి ఉండటంతో ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన వందలాది వాహనాలు నిత్యం రాకపోకలు సాగించడంతో ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. రొండాపల్లి పోలీస్ బీట్ హౌస్‌లో కేవలం ఇద్దరు, ముగ్గురు సిబ్బంది మాత్రమే ఉన్నారని, ఆయా ప్రాంతాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా దాదాపు 15 కిలోమీటర్ల దూరంలోని బొరిగుమ్మ పోలీసు స్టేషన్‌కు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. అలాగే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకునే సరికే నిందితులు పరారవుతున్న ఘటనలు ఉన్నాయన్నారు. దీనికి తోడు ప్రభుత్వ ఇంజినీరింగ్, ఐటీఐ, ఫార్మసీ కళాశాల, ఆస్పత్రి, కార్యాలయాలు, ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నాయని గుర్తుచేశారు. రోజురోజుకూ అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతంలో ఇద్దరు, ముగ్గురు సిబ్బంది మాత్రమే ఉండటం వల్ల పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. దీనిని దృష్టిలో పెట్టుకొని అంబాగుడను పూర్తి సౌకర్యాలు కలిగిన పోలీసు స్టేషన్‌గా ఉన్నతి కల్పించాలని విన్నవించారు. లేనిపక్షంలో జూలై 7న జాతీయ రహదారిపై ఆందోళనకు చేపట్టక తప్పదని స్పష్టంచేశారు.

అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం

- మజ్జిగౌరి మందిరం మేనేజింగ్ ట్రస్టీ రాయిసింగి బిడిక
- అభివృద్ధి నిమిత్తం 6.30 ఎకరాలు కేటాయించిన రాష్ట్రప్రభుత్వం



అమ్మవారికి పూజలు చేస్తున్న మంత్రి సరక



మాట్లాడుతున్న మందిరం మేనేజింగ్ ట్రస్టీ రాయిసింగి

రాయగడ: రాష్ట్రప్రభుత్వం మజ్జిగౌరి మందిర అభివృద్ధి నిమిత్తం మంజూరు చేసిన 6.30 ఎకరాల స్థలంలో వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం ప్రణాళికలు సిద్ధం చేశామని మందిరం మేనేజింగ్ ట్రస్టీ రాయిసింగి బిడిక తెలిపారు. ఈ మేరకు మందిరంలోని మండపంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థలాభావ సమస్యతో భక్తులకు సరైన సౌకర్యాలు కల్పించే అవకాశం లేకుండా పోయిందన్నారు. ప్రాంగణంలోని స్థలమంతా రైల్వే విభాగానికి చెందినది కావడంతో అభివృద్ధికి ఆటంకం ఏర్పడిందని తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం చొరవ తీసుకుని, మందిరానికి అవసరమయ్యే స్థలాన్ని ఉచితంగా ఇవ్వడంతో ఇబ్బందులు తొలగాయని ప్రకటించారు. అమ్మవారి దర్శనార్థం వచ్చే భక్తులకు అవసరమయ్యే మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు నెల రోజుల్లో పూర్తిస్థాయి నివేదిక సిద్ధం చేసేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. దీని ఆధారంగా చేపట్టాల్సిన పనులకు నిధులు కేటాయిస్తామని పేర్కొన్నారు. ప్రధానంగా సౌచాలయం, యాత్రికుల నివాస్, క్యూ కాంప్లెక్స్, షాపింగ్ కాంప్లెక్స్, వసతి గృహాలు వంటివాటికి ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. రానున్న రోజుల్లో మందిరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు ట్రస్ట్ బోర్డు కృషి చేస్తోందని వివరించారు. ఎన్నో ఏళ్ల సమస్యను పరిష్కరించిన రాష్ట్రప్రభుత్వం చొరవకు ఈ సందర్భంగా ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేసారు. సమావేశంలో ఏడీఎం ధర్మానంద బెహరా, తహసీల్దార్ తపస్ రౌత్, ట్రస్ట్ సభ్యులు ఇప్పిలి సన్యాసిరాజు, బాబు దొళాయి, దేవేంద్ర బెహరా తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఆశీర్వాదమే..

మజ్జిగౌరి అమ్మవారి ఆశీర్వాదమే మందిరం అభివృద్ధికి నాందీ పలికించిందని రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమశాఖ మంత్రి జగన్నాథ సరక అన్నారు. రాష్ట్ర కేబినెట్ మజ్జిగౌరి మందిరం అభివృద్ధికి సంబంధించి 6.30 ఎకరాల స్థలాన్ని విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. రాష్ట్ర మంత్రివర్గంలో భాగంగా ఉన్న సరక.. గురువారం స్థానిక మందిరాన్ని సందర్శించారు. అమ్మవారికి పూజలు చేసి, ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం మందిరం ట్రస్ట్ సభ్యులతో భేటీ అయిన ఆయన.. అభివృద్ధికి సంబంధించి చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అత్యంత ప్రముఖ్యత గల మజ్జిగౌరి మందిరం ప్రాధాన్యతను గుర్తించిన ప్రభుత్వం ఈ మేరకు స్పందించిందని తెలిపారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. అంతకుముందు మంత్రికి మందిరం మేనేజింగ్ ట్రస్టీ రాయిసింగి బిడిక, సభ్యులు ఇప్పిలి సన్యాసిరాజు తదితరులు స్వాగతం పలికారు. ఎస్‌డీసీ చైర్మన్ అనసూయ మాఝి, జిల్లా పరిషత్ చైర్మన్ సరస్వతి మాఝి తదితరులు పాల్గొన్నారు.

రుణపడి ఉంటాం..

ఆంధ్ర, ఒడిశా ప్రజల ఆరాధ్యదైవం మజ్జిగౌరి మందిరాభివృద్ధికి సీఎం నవీన్ పట్నాయక్ 6.30 ఎకరాల స్థలాన్ని విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించడంపై బీజేడీ సీనియర్ నాయకులు ఎల్ల కొండబాబు హర్షం వ్యక్తంచేశారు. రాష్ట్రప్రభుత్వం ఉదార స్వభావంతో చేసిన ప్రకటన రాయగడ ప్రజలు ఎప్పటికీ మరిచిపోలేరని అన్నారు. పట్టణంలోని రింగ్ రోడ్డు వద్ద ఉన్న బీజేడీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన పై విధంగా స్పందించారు. జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ టి.గౌరీశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో ఆడిట్ ఆర్‌డీడీ



సీతారామారావుకు జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని స్టేట్ ఆడిట్ శాఖ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ పి.సీతారామారావు గురువారం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ఈవో వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు, స్టేట్ ఆడిట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్వ్యూల నిర్వహణ

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో పలుమార్లు వాయిదా పడిన ప్లేస్‌మెంట్ ఆఫీసర్, బోర్డాఫ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ పోస్టులకు గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. బీసీడీసీ పోస్టుకు 11 మంది, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ పోస్టుకు 9 మంది హాజరయ్యారు. వర్సిటీ పాలక మండలి సమావేశ మందిరంలో ముగ్గురు నిపుణుల కమిటీ ఈ ఇంటర్వ్యూలు నిర్వహించింది. ఎంపికైన వారి వివరాలు త్వరలో ప్రకటిస్తామని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

సైన్సు అవార్డుల రద్దు తగదు



మాట్లాడుతున్న జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీధర్

లావేరు: సైన్సు అవార్డులు రద్దు చేయడం శాస్త్ర పురోగతికి అడ్డుకట్ట వేయడమేనని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.మురళీధర్ అన్నారు. మండలంలోని అదపాకలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సైన్సు, హెల్త్ రంగాల్లో అవార్డులు నిలిపివేయాలని ఇండియన్ నేషనల్ సైన్సు అకాడమీ తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలన్నారు. పాఠ్యాంశాల్లో డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని, పీరియాడిక్ టేబుల్ లాంటి అంశాలను తొలగించడం సరికాదన్నారు. విద్యార్థులకు శాస్త్రీయ అంశాలను తెలియపర్చకూడదనే భావన పాలకుల్లో రావడం, అశాస్త్రీయ అంశాలైన జ్యోతిష్యం, వాస్తు అంశాలను పాఠ్యాంశాలుగా చేర్పించడం తిరోగమన చర్యలకు నిదర్శనమని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలను మేధావులు, శాస్త్రవేత్తలు ఖండించాలన్నారు. ఆయనతో పాటు జేవీవీ జిల్లా, మండల నాయకులు ఉన్నారు.

అన్ని గ్రూపులూ ఏ-గ్రేడ్‌లో ఉండాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్

ఎచ్చెర్ల క్యాంపస్: అన్ని స్వయం సహాయక సంఘాలు ఏ-గ్రేడ్‌లో ఉండాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ డి.వి.విద్యాసాగర్ అన్నారు. ఎచ్చెర్ల వెలుగు కార్యాలయంలో క్లస్టర్ కోఆర్డినేటర్లు, కమ్యూనిటీ ఫెసిలిటేటర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామైఖ్య సంఘం యూనిట్‌గా సంఘాలు బలోపేతం కావాలన్నారు. నెలవారీ పొదుపు, రుణ వాయిదాల చెల్లింపు, మహిళల వ్యాపార యూనిట్ల నిర్వహణ, జీవనోపాధుల యూనిట్ల నిర్వహణ వంటి వాటికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ప్రభుత్వం అందజేస్తున్న పథకాలతో ఆర్థిక ప్రగతి సాధించాలన్నారు. ప్రతి నెలా సమావేశాలు నిర్వహించి భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. సమావేశంలో ఏపీఎం రామ్మూర్తి, సీసీలు హరి కృష్ణ, సత్యవతి పాల్గొన్నారు.

కేజీబీవీ గెస్ట్ ఫ్యాకల్టీకి న్యాయం చేయాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో కొన్నేళ్లుగా పనిచేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీ ఉపాధ్యాయినులను తొలగించడం సరికాదని సీఐటీ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు అన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా సమగ్రశిక్ష కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేజీబీవీలు 2009 నుంచి ప్రారంభమయ్యాయని, ప్రస్తుత కాంట్రాక్ట్ రిక్రూట్‌మెంట్‌లో దరఖాస్తు చేసుకుంటున్న వారిలో టెన్త్, ఇంటర్లో మార్కుల విధానానికి, గ్రేడింగ్ విధానానికి వ్యత్యాసం ఉండడం వల్ల ప్రస్తుతం పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులు నష్టపోతున్నా రని చెప్పారు. 30 ఏళ్లు పైబడినవారికి ఏడాదికి 2 మార్కుల చొప్పున వెయిటేజీ కల్పించాలని, గరిష్టంగా 20 మార్కులు ఉండాలన్నారు. పోస్టులకు పీజీ అదనపు అర్హత మాత్రమే అవుతుందని, పీజీ వెయి టేజీ మార్కులు తొలగించి, ఆ మార్కులను వయసులో కలిపేలా మార్పులు చేయాలని కోరారు.

తొలకరి చూపు..



భువనేశ్వర్ మెయిన్ రోడ్డులో వర్షపునీరు



ఐఎండీ విడుదల చేసిన రుతు పవనాల గమనం మ్యాప్

- రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు ప్రవేశం
- 1, 2 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా విస్తరించే అవకాశాలు
- భువనేశ్వర్‌లో 90.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

భువనేశ్వర్: రాష్ట్రంలోకి నైరుతి రుతు పవనాలు చొరబడ్డాయి. మల్కన్‌గిరి, కొరాపుట్ జిల్లాలోని అత్యధిక ప్రాంతాలు, గజపతి జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో గురువారం సంకేతాలు కనిపించాయని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) భువనేశ్వర్ ప్రాంతీయ కార్యాలయం ప్రకటించింది. రుతుపవనాల పురోగతికి అనుకూల వాతావరణ పరిస్థితులు ఉన్నందున ఒకటి, రెండు రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా విస్తరించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో భువనేశ్వర్, కటక్ జంట నగరాలు, తీరప్రాంత ఒడిశాలోని కొన్ని ప్రాంతాలలో గురువారం మధ్యాహ్నం భారీ వర్షాలు కురిశాయి. రాజధాని నగరం వర్షంతో తడిసి ముద్దయ్యింది. ఉదయం 11.30 గంటల సమయానికి 59.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలో 18 జిల్లాలకు ఐఎండీ ఆరెంజ్ వార్నింగ్ జారీ చేసింది. కొన్ని ప్రాంతాల్లో కుండపోత వర్షం కొనసాగే అవకాశం ఉందని తెలిపింది. పూరీ, ఖుర్దా, కటక్, జగత్‌సింగ్‌పూర్, కేంద్రాపడా, భద్రక్, ఢెంకనాల్, నయాగడ్, జాజాపూర్, గంజాం, గజపతి, మయూర్‌భంజ్, కెంజొహర్, బాలాసోర్, బొలంగిర్, బర్‌గడ్, సోన్‌పూర్, సంబలపూర్ ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీగా ఉరుములతో కూడిన వర్షం కురిసే సంకేతాలు జారీ చేసింది.

రాకపోకలకు అంతరాయం..

రుతుపవనాల ముందస్తు వర్షం కారణంగా నగరవాసులకు వేసవితాపం నుంచి ఊరట కలిగింది. కుండపోత వర్షంతో పలు చోట్ల కృత్రిమ నదులను తలపించాయి. స్థానిక శిశుభవన్ స్క్వేర్, ఇస్కాన్ టెంపుల్ పరిసరాల సర్వీస్ రోడ్డులో వర్షపునీరు నిల్వతో కృత్రిమ వరద పరిస్థితి తలెత్తింది. నగరంలో ఉదయం 11.30 గంటలకు 59.8 మిల్లీమీటర్లు, మధ్యాహ్నం 2.30 గంటలకు మరింత పెరిగి 90.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కుండపోత వర్షం కారణంగా భువనేశ్వర్ శిశుభవన్ చౌరస్తా మీదుగా వెళ్లే రద్దీ రహదారి మోకాళ్ల లోతు నీటిలో మునిగి వాహనాల రాకపోకలను తీవ్రంగా ప్రభావితం చేసింది. సమీపంలోని ఫారెస్ట్ పార్క్‌లోని ఇళ్లలోకి వర్షం నీరు చొరబడింది. భువనేశ్వర్ మున్సిపల్ కార్పొరేషన్(బీఎంసీ) బలహీన ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థను మరమ్మతులు చేసి బలోపేతం చేసినట్లు పేర్కొన్నప్పటికీ, శిశుభవన్ ప్రాంతీయులకు వర్షపు ముంపు తిప్పలు తప్పలేదు. రుతుపవనాలు పూర్తి స్థాయిలో చొరబడి వానలు పెరిగితే ఈ ప్రాంతీయుల దుస్థితి పట్ల సర్వత్రా ఆందోళన పెరుగుతోంది.

యాత్రికుల ఇబ్బందులు..

భువనేశ్వర్ లోని ఇస్కాన్ దేవాలయం ముందు రహదారి మార్గంలో వర్షపు నీరు ఏరులై పారడం పరిపాటిగా మారింద. ఈ దిశలో స్థానిక నగరపాలక సంస్థ చర్యలు నిష్ప్రయోజనంగా పరిణమించాయి. ఈ ఏడాది వర్షాకాలంలో పరిసర ప్రాంతాల్లో నీటి చొరబాటు నివారణకు బీఎంసీ భారీ ఎత్తున డ్రైనేజీ వ్యవస్థ పునరుద్ధరణ, మరమ్మతు పనులను చేపట్టినట్లు ప్రకటించింది. వాస్తవ పరిస్థితిలో చిన్నపాటి వర్షానికి ఎటువంటి మార్పు కనిపించక పోవడం పట్ల సర్వత్రా విచారం వ్యక్తం అవుతోంది. స్థానికుల దీర్ఘ ల సమస్య పరిష్కారం పట్ల యంత్రాంగం చర్యలు శూన్యమని ఆరోపిస్తున్నారు. పూరీ పట్టణంలో గురువారం ఉదయం నుంచి వర్షం కురుస్తుంది. రథాలపై దేవుళ్లను దర్శించుకునే భక్తులు, యాత్రికులకు ఈ పరిస్థితి స్వల్ప ఇబ్బంది కలిగించింది. ఆకస్మిక రద్దీ ఇతరేతర అవాంఛనీయ పరిస్థితుల నివారణ దృష్ట్యా భద్రతా దళాలు నిరవధికంగా కురుస్తున్న వర్ష వాతావరణంలో విధులు నిర్వహిస్తున్నారు. రానున్న 4, 5 రోజులలో రాష్ట్ర వ్యాప్తంగా ఉరుములతో కూడిన వర్షాలు భారీ నుంచి అతి భారీగా కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం ప్రకటన విడుదల చేసింది.



పూరీ శారదా బాలి ప్రాంతంలో వర్షంలోనే విధులు నిర్వహిస్తున్న పోలీసులు

సవర భాషకు అధికారిక గుర్తింపు

- ఆమోదం తెలిపిన రాష్ట్ర కేబినెట్

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్ పరిధి పద్మపూర్ సమితి, పుటాసింగ్ ప్రాంతాల్లో అత్యధికంగా లంజియా సవరలు నివసిస్తున్న నేపథ్యంలో ఆ భాషను రాష్ట్రప్రభుత్వం అధికారిక భాషగా గుర్తించింది. ఈ మేరకు కేంద్రానికి సిఫార్సు చేయనుంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని పద్మపూర్ సమితి మొరిచొగుడ గ్రామంలో స్పెషల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ రాష్ట్ర ముఖ్య సలహాదారుడు ప్రదీప్ మాఝి, రాయగడ జిల్లా ఎస్‌డీసీ చైర్‌పర్సన్ అనసూయా మాఝి, గుణుపూర్ ఎమ్మెల్యే రఘునాథ్ గమాంగొ, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సరస్వతీ మాఝి తదితరులు బుధవారం సాయంత్రం పర్యటించారు. సవరలిపి అక్షర బ్రహ్మ గ్రామంగా గుర్తింపు పొందిన మొరిచొగుడలో ఈ సందర్భంగా వేడుకలు జరిపారు. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ హయాంలో ఆదివాసీల జీవన స్థితిగతులు ఇంకెంతో మారనున్నాయనితెలిపారు.



ప్రదీప్ మాఝికి స్వాగతం పలుకుతున్న గిరిజన మహిళలు

25న ఉత్తరాంధ్ర సమతా సమ్మేళనం

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్రంలోని 80 అడుగుల రోడ్డులో ఉన్న ఆనందమయి ఫంక్షన్ హాలులో ఈ నెల 25న ఉతరాంధ్ర జిల్లాల సమతా సమ్మేళనం నిర్వహిస్తున్న సామాజిక సమరసతా వేదిక కన్వీనర్ బార్ల వేణుగోపాల్ తెలిపారు. గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ మహోన్నత వారసత్వాన్ని ఆచరించి మనకందించిన మహనీయులను స్మరించుకుంటూ సమరసతా సమాజాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సర్దార్ గౌతులచ్చన్న, బంకుపల్లి మల్లయ్యశాస్త్రి, పొట్నూరు స్వామిబాబు, కె.గణపతిముని, బెవర వేణుగోపాలనాయుడు, గురజాడ అప్పారావు, తాతా సుబ్బరాయశాస్త్రి, పాకలపాటి గురువులు, తెన్నేటి విశ్వనాథం,టి.సీతారామస్వామి వంటి వారిని గుర్తు చేసుకునేందుకు ఈ సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో డాక్టర్ కె.అమ్మన్నాయుడు, కె.వి.ఎస్.మూర్తి, వేదిక ఉత్తరాంధ్ర సంయోజక్ పెంట హాటకేశ్, జిల్లా విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి శ్రీరంగం మధుసూదనరావు పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సమరసతా వేదిక సభ్యులు

లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- ఐదుగురికి గాయాలు
- పైడిభీమవరం జాతీయ రహదారిపై ఘటన



క్షతగాత్రులను అంబులెన్సులో తరలిస్తున్న దృశ్యం



ఘటనా స్థలంలో ఆర్టీసీ బస్సు

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం జాతీయ రహదారిపై లారీని ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఐదుగురికి గాయాలయ్యాయి. జె.ఆర్.పురం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం పలాస నుంచి విశాఖపట్నం వైపు 35 మంది ప్రయాణికులతో ఆర్టీసీ బస్సు బయలు దేరింది. పైడిభీమవరం వద్దకు రాగానే ముందు వెళుతున్న లారీని బస్సు బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆర్టీసీ డ్రైవర్ సవర కన్నయ్యతో పాటు జలుమూరు మండలం టెక్కలిపాడుకు చెందిన సీహెచ్ శివ, శ్రీముఖలింగం గ్రామానికి చెందిన పి.విశ్వనాథం, పి.లక్ష్మి, జలుమూరుకు చెందిన గవరయ్యలకు గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి 108 వాహనానికి సమాచారం అందించారు. 108 వచ్చేలోపే అరబిందో అంబులెన్సు ద్వారా క్షతగాత్రులను శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. జె.ఆర్.పురం ఎస్సై జి.రాజేష్ ఘటనా స్థలానికి చేరుకుని ప్రయాణికులను ఇతర బస్సులో పంపించారు. బాధితుడు గవరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆర్టీసీ డ్రైవర్ కన్నయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

పూరీ సేవాయత్‌లపై చర్యలు తీసుకోవాలి

- జర్నలిస్టులపై దాడిని ఖండించిన జయపురం ప్రెస్‌క్లబ్

జయపురం: పూరీలో మంగళవారం జరిగిన ఘోష యాత్ర సమయంలో సేవాయత్‌లు జర్నలిస్టులపై దాడి చేయడం, అసభ్య పదజాలంతో దూషించడం, బెదిరింపులకు పాల్పడటం తదితర ఘటనలను జయపురం ప్రెస్‌క్లబ్ తీవ్రంగా ఖండించింది. మీడియా ప్రతినిధులపై జరిగిన దాడి పత్రికా స్వేచ్ఛకే ప్రమాదకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు డీజీపీ సునీలబన్సాల్ పేరిట రాసిన వినతిపత్రాన్ని జయపురం పటణ పోలీసు అధికారిని గురువారం కలిసి, అందించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జర్నలిస్టులపై రోజురోజుకూ దాడులు పెరుగుతున్నాయని, రక్షణకు చట్టపరమైన చర్యలు పాలకులు చేపట్టాలని కోరారు. అనేక సమయాల్లో పూరీ సేవాయత్‌లు భక్తుల పట్ల వివక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారని, బాధితుల తరఫున గళం వినిపిస్తున్నారనే అక్కసుతోనే ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఘటనలు పునరావృతం కాకుండా బాధ్యులను కఠినంగా శిక్షించాలని విన్నవించారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు పద్మనాభ హొత్తా, గౌరీప్రసాద్ పట్నాయక్, సాన రాజా, తరుణకుమార్ మహాపాత్రొ, కె.శ్రీనివాసరావు, తులసీప్రసాద్ బెహరా, సత్య పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.



పోలీసు అధికారికి వినతిపత్రం అందిస్తున్న ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు

మరింత పటిష్టంగా నిఘా వ్యవస్థ

టెక్కలి: నేరాల నియంత్రణలో భాగంగా నిఘా వ్యవస్థను మరింత పటిష్టంగా నిర్వహించాలని ఎస్పీ జి.ఆర్.రాధిక అన్నారు. నందిగాం పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల ఏర్పాటు చేసిన సీసీ కెమెరా వ్యవస్థను గురువారం ప్రారంభించారు. అంతకుముందు స్టేషన్ ఆవరణలో మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. వార్షిక తనిఖీలు నిర్వహించి రికార్డులను పరిశీలించారు. సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న పోలీస్ స్టేషన్ పరిధిలో నిఘా వ్యవస్థను పటిష్టం చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో టెక్కలి డీఎస్పీ డి.బాలచంద్రారెడ్డి, సీఐ కె.చంద్రమౌళి, ఎస్‌ఐ మహ్మద్ అమీర్ ఆలీ, రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

పూలు కోస్తుండగా చైన్‌స్నాచింగ్

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని లక్ష్మీనగర్ కాలనీలో నివాసం ఉంటున్న గృహిణి బలగ గౌరీ నిర్మల ఇంటి ఆరుబయట పూలు కోస్తుండగా వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి మూడున్నర తులాల బంగారు పుస్తెలతాడును గురువారం సాయంత్రం తెంచుకుపోయాడు. బాధితురాలు కేకలు వేసే లోపే అడ్డదారిలో పరారయ్యాడు. ఈమె భర్త బలగ వెంకటరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దశావతారాల్లో అవతారమూర్తి

- మత్స్య, కూర్మాలంకరణలో దర్శనమిచ్చిన జగన్నాథుడు
- సంధ్యా హారతికి పెద్ద సంఖ్యలో భక్తుల హాజరు

బరంపురం: నగరంలో రథయాత్ర ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. స్థానిక హన్‌మాన్ బజార్ గుండిచా మందిరంలో కొలువైన పురుషోత్తముడు.. బుధవారం సాయంత్రం మత్స్య అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వివిధ కూడళ్లలో కొలువైన జగన్నాథ, బలభద్ర, సుభద్రా మూర్తులు నవయవ్వన రూపంతో దర్శనమివ్వడంతో భక్తులు తన్మయం చెందారు.

కొరాపుట్: రథాయాత్ర సందర్భంగా నవరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని మెయిన్ రోడ్డులో ఉన్న గుండిచా మందిరంలో జగన్నాథుడు మత్స్యావతారంలో దర్శనమిచ్చాడు. భక్తుల జయజయ ధ్వానాల మధ్య స్వామివారికి హారతిచ్చారు.

రాయగడ: గుండిచా మందిరంలో పూజలందుకుంటున్న జగన్నాథ, బలభద్ర, సుభద్ర దేవతా మూర్తులు విశేష పూజలందుకుంటున్నారు. ఈ నేపథ్యంలో కూర్మావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచే గుండిచా మందిరంలో భక్తుల తాకిడి కనిపించింది. సాయంత్రం నిర్వహించే సంధ్యా హారతి తిలకించేందుకు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. దర్శనార్థం ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహక కమిటీ ఏర్పాట్లు చేసింది.



బరంపురం: మత్స్యావతారంలో దర్శనమిస్తున్న జగన్నాథుడు

ఉచిత అన్నదానం కమిటీ రద్దు

పర్లాకిమిడి: గుండిచా మందిరంలో కొలువైయున్న జగన్నాథుడు మత్స్య, కూర్మ అవతారాల్లో భక్తులకు దర్శనం కల్పించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి చతుర్థామూర్తులను దర్శించుకోవడానికి తండోపతండాలుగా జనం తరలివచ్చారు. అలాగే గుండిచా మందిరం వెలుపల ఉన్న ఆనంద బజార్‌లో ఉచిత అన్న ప్రసాదాలను రథాయాత్ర కమిటీ ఈ ఏడాది రద్దుచేశారు. అన్నదానం స్వీకరణకు రూ.30లను టికెట్‌గా నిర్ణయించారు. ఇంటికి క్యారేజ్ కావాలనుకునే వారికి రూ.100లు టికెట్ ఉదయమే తీసుకోవాల్సి ఉంటుందని ప్రకటించారు. గతంలో ఆనంద బజార్‌లో ఉచితంగా అన్నప్రసాదం(ఓభొడా) పంపిణీ చేసేవారు. మరోవైపు గుండిచా ఆలయం వెలుపల జగన్నాథునికి ఇష్టమైన మల్లపా, ఆప్పాలు, లడ్డూలు, మడత కాజాలు ఒక్కొక్కటీ రూ.10లకు విక్రయిస్తున్నారు. అయితే వర్షం కారణంగా సాయంత్రం నుంచి భక్తుల తాకిడి తగ్గిందని చిరువ్యాపారులు నిరాస వ్యక్తంచేశారు.



బరంపురం: మత్స్యావతారంలో దర్శనమిస్తున్న జగన్నాథుడు



కొరాపుట్: నవరంగ్‌పూర్‌లో కుర్మావతారంలో జగన్నాథుడు



కొరాపుట్: నవరంగ్‌పూర్‌లో కుర్మావతారంలో జగన్నాథుడు



పర్లాకిమిడి: జగన్నాథ ప్రసాద విక్రయశాల



పర్లాకిమిడి: ఆనందబజార్‌లో అన్నప్రసాదాల పంపిణీ

క్లుప్తంగా

హాట్ మిక్స్‌ప్లాంట్‌లో అగ్నిప్రమాదం



మంటలను అదుపు చేస్తున్న కొత్తవలస ఫైర్ సిబ్బంది

కొత్తవలస: విశాఖపట్నం-రాయపూర్ గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి సంబంధించి మండలంలోని గులివిందాడ గ్రామం సమీపంలో ఏర్పాటు చేసిన హాట్‌మిక్స్ ప్లాంట్‌లో గురువారం అగ్ని ప్రమాదం సంభవించింది. ప్లాంట్‌లో ఒక్కసారిగా మంటలు ఎగిసి పడడంతో కొత్తవలస ఫైర్ సిబ్బందికి ప్లాంట్ నిర్వాహకులు సమాచారం అందజేశారు. ఈ మేరకు అగ్నిమాపక అధికారి అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి మంటలను అదుపు చేశారు.ఈ ప్రమాదంలో సుమారు రూ.4లక్షల వరకు ఆస్తినష్టం సంభవించినట్లు అంచనా వేశారు. హాట్‌మిక్స్ ప్లాంట్‌లో కనీసం ఫైర్‌సేఫ్టీని అనుసరించ లేదని ఫైర్ అధికారి అశోక్‌కుమార్ ఈ సందర్భంగా అసహనం వెలిబుచ్చారు. ఇప్పటికైనా సేఫ్టీని పాటించాలని సూచించారు.

25 మద్యం సీసాల పట్టివేత

వేపాడ: మండలంలోని కొండగంగుబూడి పంచాయతీ ఎస్.కోట సీతారాంపురం గ్రామంలో గురువారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కొత్తవలస సిబ్బందితో కలిసి నిర్వహించిన దాడుల్లో 25 మద్యం సీసాలు పట్టుబడి నట్లు ఎస్సై నరేంద్ర కుమార్ తెలిపారు. అనధికార మద్యం విక్రయాలపై వచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ సీహెచ్.రాజేశ్వరి ఆదేశాలతో నిర్వహించిన దాడుల్లో గ్రామానికి చెందిన దువ్వాడ శివ వద్ద 25 మద్యం సీసాలు పట్టుబడినట్లు చెప్పారు. పట్టుబడిన మద్యం సీసాలను సీజ్ చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చెప్పారు. ఈ దాడుల్లో హెచ్‌సీ అప్పారావు, కానిస్టేబుల్స్ సంతోష్‌కుమార్, విజిలెన్స్ వింగ్ హెచ్‌సీ పీవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

గరుగుబిల్లిలో మరో 89 మద్యం సీసాలు..

గరుగుబిల్లి: ఎలాంటి అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై ఎం.రాజేష్ గురువారం తెలిపారు. మండలంలోని ఎస్ఆర్‌పేటలో గ్రామానికి చెందిన గుడ్ల మన్మధరావు అక్రమంగా బెల్ట్‌షాపు నిర్వహిస్తున్నాడని 89 క్వార్టర్ బాటిల్స్, 16 బీరు బాటిల్స్ కలిగి ఉండడంతో స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి తదుపరి చర్యల నిమిత్తం మెజిస్ట్రేట్ కోర్టు ఎదుట హాజరు పరచనున్నట్లు తెలిపారు.

బొబ్బిలిలో 240 మద్యం సీసాలు..

బొబ్బిలి: పట్టణంలోని దిబ్బవీధికి చెందిన వేగి సూరిబాబు 240 మద్యం సీసాలు తరలిస్తుండగా గొల్లపల్లి పైల వీధి జంక్షన్ తన సిబ్బందితో పహారా కాస్తున్న ఎస్సై వి.జ్ఞాన ప్రసాద్ పట్టుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని మద్యం సీసాలు, తరలిస్తున్న ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసినట్టు ఎస్సై ఈ సందర్భంగా విలేకరులకు తెలిపారు.

2400 కిలోల పీడీఎస్ బియ్యం పట్టివేత

సీతంపేట: మండలంలోని దోనుబాయి గ్రామం నుంచి కొత్తూరు వైపు అక్రమంగా వ్యాన్‌లో తరలిస్తున్న 2,400 కిలోల పౌరసరఫరాల శాఖకు చెందిన బియ్యం బుధవారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్సై ఎ.నీలకంఠరావు తెలిపారు. మొత్తం 48 బ్యాగ్‌లలో ఇద్దరు వ్యక్తులు బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకుని అదుపులోకి తీసుకున్నామన్నారు. బియ్యాన్ని సివిల్ సప్‌లైస్ అధికారులకు అప్పగించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పశువులు రవాణా చేస్తున్న వ్యాన్ సీజ్

సీతంపేట: మండలంలోని సోమగండి సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా పశువులు అక్రమంగా రవాణా చేస్తున్న వ్యాన్‌ను పట్టుకున్నట్లు ఎస్సై ఎ.నీలకంఠరావు తెలిపారు. బలద సంత నుంచి రాజాం పట్టణానికి తరలిస్తుండగా మొత్తం 8 పశువులను పట్టుకుని గోశాలకు తరలించామని చెప్పారు. ఇందుకు సంబంధించి ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రాజాం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు మహర్దశ

- కొత్త కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.1.48 కోట్లు మంజూరు

రాజాం: ప్రయాణికులకు శుభవార్త. రాజాం ఆర్టీసీ కాంప్లెక్స్ రూపుమారనుంది. అన్ని హంగులతో ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.48 కోట్లు మంజూరు చేసినట్టు రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అమరావతి నుంచి ఫోన్‌లో గురువారం స్థానిక విలేకరులకు తెలిపారు. రాజాంలో ఇంతవరకు ఆర్టీసీ కాంప్లెక్స్ లేక మున్సిపల్‌శాఖ స్థలంలోని బస్టాండ్‌లో నడుస్తోంది. జిల్లాల విభజనకు ముందు శ్రీకాకుళం జిల్లా ఆర్టీసీ అధికారులు కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రస్తుత బస్టాండ్ సమీపంలో స్థల నిర్ధారణ చేశారు. జిల్లాల పునర్విభజనతో రాజాం విజయనగరం జిల్లాలో చేరడంతో కొత్త ప్రతిపాదనల మేరకు నిధులు మంజూరైనట్టు ఎమ్మెల్యే వెల్లడించారు. కాంప్లెక్స్ భవనాలు, నైట్ హాల్ట్ స్టాప్‌లు, ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బందికి విశ్రాంతి గదులు తదితర సదుపాయాలతో నిర్మాణాలు సాగుతాయన్నారు. కేబినెట్ ఆమోదం మేరకు నిధులు మంజూరైనట్టు ఆర్టీసీ అధికారులు వెల్లడించారన్నారు.

వసివాడుతున్న బాల్యం!

- బాల్యవివాహాల నిరోధానికి పటిష్ట చర్యలు
- అడ్డుకట్ట వేసేందుకు ఎక్కువ మంది అధికారులకు బాధ్యతలు
- పకడ్బందీగా చట్టం అమలుకు నిర్ణయం



బాల్యవివాహాల నిషేధ చట్టం వాల్‌పోస్టర్

విజయనగరం ఫోర్ట్: రాజారామ్మోహన్ రాయ్, కందుకూరి వీరేశలింగం పంతులు వంటి సంఘసంస్కర్తల కృషి ఫలితంగా బాల్యవివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన పెరిగింది. అయినా మారుమూల గ్రామాల్లో అక్కడక్కడా బాల్య వివాహాలు ఇప్పటికీ జరుగుతూనే ఉన్నాయి. బాల్య వివాహం బాలికల జీవితాలను, ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. వారి భవిష్యత్తు అవకాశాలను కోల్పోయేలా చేస్తుందని వైద్యులు, మేధావులు, చెబుతూనే ఉన్నారు. అయినప్పటికీ ఆటపాటలతో ఆనందంగా గడవాల్సిన బాల్యం మూడుముళ్ల బంధంలో చిక్కుకుంటోంది. పుస్తకాలు మోయాల్సిన వయస్సులో పుస్తెల తాడు మోస్తున్నారు. వివాహంఅంటే ఏమిటో తెలియకపోయినా పెద్దలు చెప్పారని తలవంచి తాళి కట్టించుకుంటున్నారు. పేదరికమో, పోషణ కష్టమో కానీ చిరు ప్రాయంలో అమ్మాయిలకు పెళ్లి చేయాలని పెద్దలు భావించి చేస్తున్నారు. స్నేహితులతో కబుర్లు చెప్పుకోవాల్సిన వయస్సులో కుటుంబభారాన్ని బాలికలు మోస్తున్నారు. ఆడుకోవాల్సిన వయస్సులో పిల్లలను ఆడిస్తున్నారు. చిరు ప్రాయంలో తల్లులు కావడం వల్ల అనేక అనారోగ్య సమస్యల బారిన పడి ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేసి బాలికలకు ఉజ్వల భవిష్యత్తు కల్పించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బాల్య వివాహ నిరోధక చట్టాన్ని సమర్థంగా అమలు చేయాలని నిర్ణయించింది. నిరోధానికి చర్యలు బాల్య వివాహాల వల్ల అనేక అనర్థాలు ఉన్నందున వాటికి అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వాటి నిరోధానికి గతంలో ఉన్న అధికారుల కంటే మరింత మందిని నియమించింది. బాల్య వివాహ నిరోధక చట్టం 2006కు సంబందించిన జీఓ నంబర్ 13ను 2012లో మార్చి 19వ తేదీన ప్రభుత్వం జారీ చేసింది. వివాహాల నిరోధానికి జిల్లా, డివిజన్, మండల, గ్రామస్థాయి కమిటీలు ఉన్నాయి. జిల్లా స్థాయి కమిటీకి కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. డివిజన్ స్థాయి లో చైర్మన్‌గా ఆర్‌డీఓ, రెండు, మండలాలకు చైర్మన్‌గా సీడీపీఓ వ్యవహరిస్తారు. మండలస్థాయిలో తహసీల్దార్, ఎంపీడీఓ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, మున్సిపాల్టీల్లో కమిషనర్ బాల్య వివాహాల నిరోధక అధికారులుగా వ్యవహరిస్తారు. గ్రామస్థాయిలో సర్పంచ్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు, సభ్యులుగా పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, స్థానిక పాఠశాల హెచ్‌ఎం, స్వయం సహాయక సంఘం సభ్యురాలు ఒకరు, పంచాయతీ వార్డు మెంబర్ ఒకరు, ఏఎన్‌ఎం, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి, యువజన సంఘం ప్రతినిధి, స్వయం సహాయక సంఘం సభ్యురాలు, మహిళా సంరక్షక్ పోలీస్ సభ్యులుగా వ్యవహరిస్తారు.

2012 నుంచి నిలుపుదల చేసిన బాల్య వివాహాలు	
సంవత్సరం	వివాహాల సంఖ్య
2012	33
2013	68
2014	52
2015	71
2016	69
2017	75
2018	85
2019	86
2020	90
2021	113
2022	49
2023	73

వివాహ వయసు వచ్చే వరకు పర్యవేక్షణ

బాల్య వివాహాలు నిలుపుదల చేస్తున్నప్పుడు వివాహం నిలుపుదల చేస్తున్నామని తల్లిదండ్రులు/సంరక్షకుల నుంచి లిఖిత పూర్వకంగా హామీ తీసుకుంటున్నప్పటికీ కొద్ది రోజుల తర్వాత బాలికలకు గుట్టుగా వివాహం చేసేస్తున్నారు. ఇకపై వాటికి అడ్డుకట్ట వేసేవిధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు బాల్య వివాహం నిలుపుదల చేసిన తర్వాత సంబంధిత బాలికకు చట్టరీత్యా వివాహ వయస్సు వచ్చేంతవరకు నిరంతరం పర్యవేక్షించే బాధ్యతను మహిళా సంరక్షక్ పోలీస్‌కు అప్పగించారు.



బాల్యవివాహ నిలిపివేయాలని కౌన్సెలింగ్ చేస్తున్న అధికారులు

ఈ ఏడాది 73 బాల్య వివాహాల నిలుపుదల

2024 జనవరి నెల నుంచి ఇప్పటి వరకు బాలల సంరక్షణ అధికారులు, పోలీసులు, ఐసీడీఎస్ సిబ్బంది 73 బాల్య వివాహాలను నిలుపుదల చేశారు.

వయస్సు వచ్చేంతవరకు పర్యవేక్షణ

బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయడానికి ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టింది. వివాహాలను నిలుపుదల చేసినప్పటికీ బాలికకు వివాహ వయసు వచ్చేవరకు పర్యవేక్షణ చేయనున్నారు. దీనివల్ల బాల్య వివాహా లను పూర్తిస్థాయిలో నిరోధించడానికి అవకాశం ఉంటుంది.

అల్లు సత్యనారాయణ,
బాలల సంరక్షణ జిల్లా అధికారి

సెంచూరియన్‌లో ఓపెన్ టోర్నమెంట్ ప్రారంభం



సెంచూరియన్ క్రీడా మైదానంలో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న వీసీ జీఎస్‌ఎన్ రాజు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ యూనివర్సిటీలో ఓపెన్ టోర్నమెంట్ పోటీలను వీసీ జీఎస్ఎన్ రాజు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 73 జట్లు వాలీబాల్, క్రికెట్, ఫుట్‌బాల్, టెన్నిస్ డబుల్స్ తదితర క్రీడల్లో తలపడనున్నాయన్నారు. ఫుట్‌బాల్, క్రికెట్ విజేతలకు ప్రథమ బహుమతి కింద రూ.10వేలు నగదు, ద్వితీయ బహుమతి కింద రూ.5వేలు, ట్రోఫీలు అందజేస్తామన్నారు. లాన్ టెన్నిస్, వాలీబాల్ విజేతలకు ప్రథమ బహుమతి రూ.5వేలు, ద్వితీయ బహుమతి రూ.2,500, ట్రోఫీలు అందజేస్తామని చెప్పారు. ఓటమిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ ఆర్ ఎస్ వర్మ, స్పోర్ట్స్ డైరెక్టర్ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్‌పై బొగ్గు లారీ బోల్తా

- నిలిచిపోయిన ట్రాఫిక్



లారీని క్రేన్ సహాయంతో తీస్తున్న దృశ్యం

బొబ్బిలి: విశాఖ-రాయగడ అంతర్రాష్ట్ర రోడ్డులో రాయగడ వెళ్తున్న భారీ బొగ్గులారీ గురువారం బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో దాదాపు గంటన్నరకు పైగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. సమాచారం మేరకు పట్టణ ఏఎస్సీ కొండలరావు, ట్రాఫిక్ ఎస్సై జి.పోలినాయుడులు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని బొగ్గును పొక్లెయినర్‌తో పక్కకు తోడించారు. అలాగే క్రేన్‌ను తీసుకువచ్చి లారీని రోడ్డు పక్కగా తీయించి అటు ఐటీఐ కాలనీ, ఇటు వైపు జూట్‌మిల్లు వరకూ నిలిచిపోయిన వాహనాలకు దారి ఇచ్చారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



సాలూరు: జగదీష్ మృతదేహం

సాలూరు: రామభద్రపురం మండలం ముచ్చర్లవలస గ్రామానికి చెందిన సువ్వాడ జగదీష్(18) విద్యుత్ షాక్‌తో సాలూరులో గురువారం మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయ. తన మేనమామ నడుపుతున్న సప్లయిర్స్, టెంట్ హౌస్‌లో పనులకు జగదీష్ వెళ్తున్నాడు. ఈ క్రమంలో మండలంలోని మరిపల్లి గ్రామంలో ఆదివారం జరగబోయే ఓ ఇంటి శుభకార్యానికి సబంధించి గురువారం స్టేజ్ వేస్తుండగా, ప్రమాదవశాత్తు అక్కడ పైన ఉన్న విద్యుత్ వైర్లు పెండాల్ రాడ్లకు తాకడతంతో విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. వెంటనే సాలూరు ఏరియా ఆస్పత్రికి తరలించినప్పటికీ అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి తల్లి వెంకటమ్మ, అన్నయ్య యుగంధర్ ఉన్నారు. మృతుని అన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రెండు బైక్‌లు ఢీకొని ఒకరు..



డెంకాడ: ప్రమాదంలో మరణించిన పట్టా ప్రసన్న

డెంకాడ: మండలంలోని దొడ్డిబాడువ గ్రామం వద్ద విజయనగరం-నాతవలస ఆర్‌అండ్‌బీ రహదారిపై రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. విజయనగరం నుంచి నాతవలస వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం, నాతవలస నుంచి విజయనగరం వస్తున్న ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నాతవలస నుంచి విజయనగరం వైపు స్కూటీపై వస్తున్న పట్టా ప్రసన్న (28) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతుడిది భోగాపురం మండలంలోని మాలనందిగాం గ్రామం.

రైల్వేట్రాక్‌పై మృతదేహం



రైల్వే ట్రాక్‌పై విగత జీవిగా పడి ఉన్న నల్లా రవీంద్ర చంద్రమౌళి

కొమరాడ: మండలంలోని కెమిశీల పంచాయతీ తులసిగ్రామానికి చెందిన నల్లా రవీంద్రచంద్రమౌళి(32) కూనేరు, గుమడ రైల్వే స్టేషన్ల మధ్య సరుగుడుగూడ జంక్షన్ సమీపంలో రైల్వేట్రాక్‌పై విగత జీవిగా పడి ఉన్నాడు. దీన్ని గమనించిన రైల్వే సిబ్బంది, స్థానికులు జీఆర్పీ సిబ్బందికి సమాచారం అందించారు సమాచారం తెలుసుకున్న జీఆర్‌పీ సిబ్బంది వచ్చి పరిశీలించి మృతదేహన్ని స్వాధీనం చేసుకుని పార్వతీపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.



విలేకరులతో మాట్లాడుతున్న భార్య రాధ

మృతిపై అనుమానాలు

అయితే తన భర్త రవీంద్ర చంద్రమౌళి మృతిపై పలు అనుమానులు ఉన్నాయి అంటూ మృతుడి భార్య రాధ, సర్పంచ్ తాడింగి భీమయ్య విలేకరులకు చెప్పారు. మృతదేహంపై ఎక్కడా ఎలాంటి గాయాలు కన్పించడం లేదని ఎక్కడో హత్య చేసి తీసుకువచ్చి ట్రాక్‌పై పడివేసినట్లు ఉంది తప్ప రైల్వే ప్రమాదంలో మృతి చెందినట్లు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మృతిపై పూర్తి దర్యాప్తు చేపట్టి న్యాయం చేయాలని ఫిర్యాదులో కోరారు. మృతుడికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.


గెడ్డలుప్పి పరిసరాల్లో చిరుతపులి

- భయాందోళనలో ప్రజలు
- అప్రమత్తంగా ఉండాలన్న అటవీశాఖ అధికారులు



చిరుతపులి పాదముద్రలను గుర్తిస్తున్న అటవీశాఖ సిబ్బంది

సీతానగరం: మండలంలోని గెడ్డలుప్పి గ్రామ కళ్లాల్లో గురువారం మధ్యాహ్నం చిరుతపులి సంచరిస్తోందన్న సమాచారంతో గ్రామస్తులు భయాందోళ చెందుతున్నారు. గ్రామానికి చుట్టం చూపుగా వచ్చిన వ్యక్తి కళ్లంవైపు వెళ్తుండగా పులి కనిపించడంతో పరుగున వచ్చి గ్రామస్తులకు తెలియజేశాడు. వెంటనే సర్పంచ్ తిరుపతినాయుడు, పంచాయతీ కార్యదర్శి మోహనరావు జిల్లా కేంద్రంలో ఉన్న అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఈ మేరకు అటవీశాఖ అధికారి త్రినాథరావు సిబ్బందితో కలిసి గెడ్డలుప్పి గ్రామంలో పులిసంచరిస్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు. పాదముద్రలను బట్టి చిరుతపులి అయి ఉండవచ్చన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.



చిరుతపులి కనిపించిన ప్రదేశం ఇదే..

ఎమ్మెల్యే పుష్పశ్రీవాణికి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు



కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు

కురుపాం: కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి జన్మదినం సందర్భంగా గురువారం కురుపాం మండలానికి చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు చినమేరంగి గ్రామానికి వెళ్లి పుష్పగుచ్ఛాలు ఆమెకు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇటువంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మండల కన్వీనర్ గౌరీశంకరరావు, ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ సుజాత, ఎంపీటీసీలు విద్యారాణి, బంగారునాయుడు, సంతోషిరాణి గౌడు, మాజీ ఏఎంసీ చైర్మన్ వెంకటరావు, స్టేట్‌ఫైనాన్స్, కళింగ వైశ్య, అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్లు ఆనిమి ఇందిరాకుమారి, కొత్తకోట సురేష్, జి. విజయ్, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సివిల్స్ ర్యాంకర్‌కు జెడ్పీ చైర్మన్ అభినందన



సివిల్స్ ర్యాంకర్ సంతోష్‌కుమార్‌ను అభినందిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: జాతీయ పోటీ పరీక్ష సివిల్స్‌లో 607వ ర్యాంక్ సాధించిన బవిరి సంతోష్‌కుమార్‌ను జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అభినందించారు. రేగిడి మండలం ఖండ్యాం గ్రామానికి చెందిన సంతోష్‌కుమార్ గురువారం జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ కార్యాలయంలో చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిశాడు. 2020 నోటిఫికేషన్‌లో సివిల్స్ పరీక్షలకు హాజరు కాగా 2021లో విడుదలైన ఫలితాల్లో ర్యాంక్ సాధించి పోస్టల్ సర్వీస్‌లో ఉద్యోగం పొంది ఢిల్లీలో శిక్షన పొందుతున్నాడు. ఐఏఎస్ సాధించాలనే లక్ష్యంతో 2022 నోటిఫికేషన్‌లో మరోమారు పరీక్షకు హాజరై 607 ర్యాంక్ సాధించాడు. వరుసగా రెండుసార్లు సివిల్స్ పరీక్షలో ర్యాంక్ సాధించిన సంతోష్‌కుమార్‌ను జెడ్పీ ఛైర్మన్ అభినందించారు.

జాతీయ జూడో పోటీలకు జిల్లా విద్యార్థుల ఎంపిక



జూడో పోటీలలో పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి,హెచ్‌ఎం భాస్కరరావు

రామభద్రపురం: తిరుపతిలో ఈ నెల 17,18,19 తేదీలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూడో పోటీలలో పాల్గొన్న జిల్లాలోని కొట్టక్కి ఉన్నత పాఠశాలకు చెందిన తూముల యశోద, పీఎస్ బొడ్డవలస సాంఘిక సంక్షేమపాఠశాలకు చెందిన జి.వరుణ్ బంగారు పతకాలు సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు జిల్లా జూడో అసోసియేషన్ కార్యదర్శి బొత్స రత్నకిశోర్ గురువారం తెలిపారు. అలాగే కొట్టక్కికి చెందిన ముత్యాల వినీత సిల్వర్, సామిరెడ్డి సంధ్య బ్రాంజ్, సామిరెడ్డి రామలక్ష్మి బ్రాంజ్, కిర్ల రమ్య బ్రాంజ్, పెదమేడపల్లికి చెందిన కె శ్రావణి బ్రాంజ్, పీఎస్ బొడ్డవలసకు చెందిన జి.కల్యాణ్ రామ్ బ్రాంజ్ పతకాలు సాధించారని చెప్పారు. పతకాలు సాధించిన విద్యార్థులను జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, కొట్టక్కి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రావాడ భాస్కరరావు తదితరులు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

యువజనోత్సాహం

- ఉల్లాసంగా యువజనోత్సవాలు
- ఆటపాటలతో అలరించిన యువతీయువకులు
- విజేతలను రాష్ట్రస్థాయి యువజనోత్సవాలకు ఎంపిక
- జిల్లాకు పేరు తేవాలి: ఎమ్మెల్యే జోగారావు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న అధికారులు

పార్వతీపురంటౌన్: థింసా నృత్యాలు.. ఆలోచింపజేసే రచనలు.. మనసును హత్తుకునే కవితలు.. జానపద కళా ప్రదర్శనలు.. మంత్రముగ్దులను చేసే చిత్రలేఖనాలు.. ఆకట్టుకునే ఉపన్యాసాలతో మన్యం యువతీయువకులు మురిపించారు. చూపరులను మైమరిపించారు. పార్వతీపురంలోని శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల వేదికగా గురువారం నిర్వహించిన యువజనోత్సవాల్లో ఉల్లాసంగా.. ఉత్సాహంగా పాల్గొన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలతో సందడి చేశారు. కేరింతలు కొట్టారు. 'యువ ఉత్సవ్-2047' థీమ్‌తో జిల్లా నెహ్రూ యువకేంద్రం, శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యువజనోత్సవాలు సాగాయి. సృజనాత్మక రచన, కవిత్వం, చిత్ర లేఖనం, జానపద, సాంస్కృతిక నృత్యాలు, మొబైల్ ఫొటోగ్రఫీ, ఉపన్యాసం వంటి పోటీల్లో యువత తమదైన ప్రతిభను ప్రదర్శించారు. గిరిజన నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకుని మెరుగైన అవకాశాలను అందిపుచ్చుకోవాలని యువతకు పిలుపునిచ్చారు. యువతలో దాగివున్న ప్రతిభా పాటవాలను వెలికితీయడమే లక్ష్యంగా ప్రభుత్వం యువజనోత్సవాలను నిర్వహిస్తోందన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకొని, వాటి సాధనకు నిరంతర పరితపించాలన్నారు. స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకొని బంగారు భవితకు బాటలు వేసుకోవాని సూచించారు.



విజేతలకు వీరే...

సృజనాత్మక రచన: పి.పుణ్యవతి, జి.గౌతమి, పి.సౌమ్య
చిత్రలేఖనం: టి.పవిత్ర, ఎస్.గౌరీశంకర్‌రావు, మహేష్
మొబైల్ ఫొటోగ్రఫీ: ఎస్.సంతోష్‌కుమార్, బి.వంశీ, ఎస్.గణపతి
సాంస్కృతిక జానపద కళలు: రాజారత్నం నాట్య మండలి, రాధా కృష్ణబృందం, థింసా గ్రూప్

ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

- వచ్చే నెల 5వ తేదీలోగా దరఖాస్తుల స్వీకరణ

విజయనగరం అర్బన్: ఉమ్మడి విజయనగరం జిల్లా నిరుద్యోగ యువతకు ఉపాధి కలిగించే పలుకోర్సులకు ఉచిత శిక్షణ తరగతులను స్థానిక మహిళా ప్రాంగణంలోని స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ వసతి గృహంలో నిర్వహిస్తామని సంస్థ కార్యదర్శి జీబీవీ రమణ తెలిపారు. కంప్యూటరైజ్డ్ అకౌంటింగ్, హౌస్ వైరింగ్ కోర్సులపై శిక్షణ ఉంటుందని చెప్పారు. వసతి భోజన సౌకర్యాలను ఉచితంగా కల్పించే ఈ కోర్సులకు తెల్లకార్డు దారులు, 45 ఏళ్లలోపు ఉన్న గ్రామీణ ప్రాంత యువత మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తిగల అభ్యర్థులు వచ్చే నెల 4వ తేదీ లోపు దరఖాస్తులను కార్యాలయానికి పంపాలని సూచించారు. పూర్తి వివరాల కోసం ఫోన్ 9959521662, 9985787820 నంబర్లను సంప్రదించాలని కోరారు.

కాలువకు కొత్తరూపు



పూడికలు తొలగించక ముందు చీపురుపల్లి మండలం రెడ్డిపేట-శివరాం మధ్యలో తోటపల్లి కుడి ప్రధాన కాలువ



పూడికలు తొలగించిన తరువాత కుడి ప్రధాన కాలువ ఇలా...

తొలకరి పలకరిస్తోంది. జిల్లాలో అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. రైతన్నలు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమయ్యే వేళ.. జిల్లా యంత్రాంగం సాగునీటి కాలువలను అద్దంలా తీర్చిదిద్దింది. ఉపాధిహామీ నిధులతో సాగునీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా పూడికలు తొలగించింది. తోటపల్లి ప్రాజెక్టు కుడిప్రధాన కాలువకు పది రోజుల కిందటే అధికారులు సాగునీటిని విడిచిపెట్టారు. సుమారు 89వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించే దిశగా 'సాగు'తున్నారు. 117 కిలోమీటర్ల మేర విస్తరించిన కాలువ పనులు పూర్తికావడంతో ఈ ఏడాది శివారు భూములకు సాగునీటి ఎద్దడి తలెత్తదని అధికారులతో పాటు రైతులు భావిస్తున్నారు.

– చీపురుపల్లి